


# దేవుడు


- గుండు సుబ్రహ్మణ్యదీక్షితులు

ఉగాది పోటీలో ఎంపికైన కథ

'టంగ్, టంగ్, టంగ్... దఢేల్... టంగ్, టంగ్, టంగ్... దఢేల్... టంగ్, టంగ్, టంగ్... దఢేల్...'

- పేటలో ఏప్రిల్ నెల మిట్టమధ్యాహ్నంవేళ తన ఇంట్లో మాగన్నుగా నిద్రపోతూన్న రిటైర్డ్ లెక్చరర్ విష్ణుచక్రం, ఈ చప్పుడు విని ఇంట్లోంచి వీధిలోకొచ్చి చుట్టూ చూసాడు. అతనికి ఏమీ కనబడలేదు. ఈ చప్పుడు మళ్లీ వినిపించింది. అతను, పెద్ద వీధిలోకొచ్చి చూసాడు. అర ఫర్లాంగు దూరంలో ఉన్న గోపాలస్వామి గుడి గోపురం మీదికి ఎక్కి ఉన్న పనివాళ్లు కనిపించారు.

తికమకగా విష్ణుచక్రం ఆ గోపురం దగ్గరికి నడిచాడు.



ఆ గోపురం మీద చెక్కబడి ఉన్న శిల్పాలను ఒక్కొటొక్కటిగా చెక్కేస్తున్నారు, ఆ పని వాళ్లు. కంగారుగా విష్ణుచక్రం, "ఎందుకు పడగొడుతున్నారయ్యా, శిల్పాల్ని?"అని అరిచాడు.

పైనుంచి వాళ్లన్నారు, "ఎందుకో మాకేం తెలుసండి, అసిస్టెంటు కమీషనరుగారు పురమాయించారు. చేస్తున్నాం."

"ఎక్కడున్నాడాయన?"

"లోపల గుళ్లో ఉన్నారు. వెళ్లండి".

విష్ణుచక్రం, తన చెప్పుల్ని గోపురం కింద విడిచి, లోపలకెళ్లాడు. ఖాళీ ఆవరణ దాటాడు. ముఖ మంటపంలో కుర్చీలో ఒక ఆసామీ బూట్లతో కూర్చొని ఉన్నాడు. లోపల గర్భగుడిలో గోపాలస్వామి విగ్రహం నిలబడి ఉన్న పీఠంకన్నా ఈ,కుర్చీ ఎత్తుగా ఉంది. ఆ ఆసామీ పక్కనే విష్ణు చక్రానికి తెలిసిన ఆ ఆలయం ఈ.వో., సీనియర్ అసిస్టెంటులు నిలబడున్నారు.

విష్ణుచక్రం వెడుతూనే ఆ ఆసామీతో "అసిస్టెంటు కమీషనరుగారు మీరేనా?" అన్నాడు.

ఆ ఆసామీ తలెగరేసి ఈ.వో. వంక చూసాడు. ఈ.వో. చటుక్కున అందుకొని, "అవున్సార్, వీరే! పరిశుద్ధంగారు! తొందర్లో కమీషనర్ కాబోతున్నారు."

విష్ణుచక్రం, "నమస్కారం, నేను ఈ ఊరువాణ్ణి. రిటైర్డ్ లెక్చరర్ని. నన్ను విష్ణుచక్రం అంటారు... గోపురం పడగొట్టిస్తున్నారెందుకు?"

పరిశుద్ధం కరుగ్గా అన్నాడు, "పడగొట్టించట్లేదు... బీట్లిస్తే బాగుచేస్తున్నాం."

"బీట్లు బాగు చెయ్యటానికి శిల్పాలను చెక్కెయ్యాలా?... క్షీరసాగర మథనం చెక్కేసారు. కాళీయ మర్దనం చెక్కేసారు. ఖజరహోను తలదన్నే కామకళా శిల్పాలను నేలపాలు చేసారు... తూర్పువైపునున్న అద్భుత శిల్పాలు సగం మట్టిలో కలిసాయి."- ఇల్లా అంటూనే స్వరం హెచ్చించి అన్నాడు విష్ణుచక్రం, "ప్రాచీన శిల్పాలను నేలపాలుచేసే అధికారం మీకెవరిచ్చారండి?"

కోపంగా అన్నాడు పరిశుద్ధం, "ఏం మీరివ్వలేదని బాధగా ఉందా?... బీట్లు బాగుచెయ్యటానికి శాంక్షన్ అయిన లక్ష రూపాయల్నీ మేం ఖర్చుచెయ్యాలి. అది మా డ్యూటీ. ఎందుకు, ఏమిటి అని ప్రశ్నించే అధికారం ప్రతి టామ్ డిక్ హారీకి ఇవ్వలేదు, గవర్నమెంటు!"

విష్ణుచక్రం చిరాగ్గా అన్నాడు, "ఏంటీ, టామ్ డిక్ అండ్ హారీయా!... ఆ టామ్ డిక్ అండ్ హారీయే చెబుతున్నాడు వినండి... ఇది వెయ్యేళ్లనాటి చోళులు కట్టించిన గోపురం. రాజరాజనరేంద్రుడి కాలం నాటిది. కనుక పురావస్తుశాఖవారి అనుమతి తీసుకొనకుండా దీన్ని ముట్టటానికి వీల్లేదు. వందేళ్లు దాటిన కట్టడాలను కూల్చాలన్నా, అసలు మరమ్మతులు చెయ్యాలన్నా ఆ శాఖ వారి అనుమతి తీసుకోవాలి, మీరు తీసుకున్నట్లు లేదు. అంటే, ప్రజల సొత్తును ప్రజలకు తెలీకుండా, ప్రభుత్వశాఖకు తెలీకుండా మీరు ధ్వంసం చేస్తున్నారు. ఇది మంచిది కాదు. ఈ విధ్వంసాన్ని మీరు తక్షణం ఆపాలి!"

పరిశుద్ధం కోపం కక్కుతూ అన్నాడు, "నువ్వెవడివయ్యా ఆ ఏమని చెప్పటానికి!... సి.ఎమ్.వా, సుప్రీం చీఫ్ జస్టిస్‌వా!... అసలు నా డ్యూటీ చెయ్యకుండా ఆపుతున్నావు నువ్వు. గుర్తుంచుకో!"

విష్ణుచక్రం చురుగ్గా ఓ చూపు చూసాడు. గిరుక్కున వెనక్కి తిరిగాడు. తిన్నగా ఏలూరు హెడ్‌పోస్టాఫీసుకెళ్లాడు. హైకోర్టు చీఫ్ జస్టిస్ పేరున టెలిగ్రాం ఇచ్చాడు. "ఇక్కడ మీ పేటలో ఉన్న వెయ్యేళ్లనాటి దేవాలయ గోపురం మీది శిల్పాలను అసిస్టెంటు కమీషనర్ రిపేర్ల కోసం అని చెప్పి చెక్కించేస్తున్నాడు. పురావస్తు శాఖ వారి అనుమతి లేదు. ఆ అద్భుత శిల్పాలు మళ్లీ ఆ గోపురం మీదికి రావటం అసంభవం. దయచేసి కోర్టు వారు తగిన చర్యతీసుకోండి". విష్ణుచక్రం తన ఇంటికొచ్చాడు.

మర్నాడు ఆదివారం. దేవాలయ గోపురం మీదికి పనివాళ్లు రాలేదు.

* * *

ఆ మర్నాడు సోమవారం మధ్యాహ్నం రెండు గంటలవేళ పరిశుద్ధం పంపిన పిలుపు అందుకొని విష్ణుచక్రం గోపాలస్వామి గుడికి వెళ్లాడు. అంతా పరిశుద్ధం చుట్టూ నిలబడున్నారు.

కుర్చీలో కూర్చొనున్న పరిశుద్ధం, తన చేతిలోని కాగితాన్ని విష్ణుచక్రం వైపు చూపిస్తూ, "గోపురం పని ఆపెయ్యమని హైకోర్టు అత్యవసర ఉత్తర్వులిచ్చింది. నువ్వే వెళ్లావా కోర్టుకి?"

విష్ణుచక్రం అన్నాడు, "ముందు నేను కూర్చోవాలి. కుర్చీ తెప్పించండి."

కుర్చీ వచ్చింది. విష్ణుమూర్తి దాంట్లో కాలు మీద కాలేసుకుని కూర్చున్నాడు. అన్నాడు, "ముందు గౌరవం ఇచ్చి పుచ్చుకోవడం నేర్చుకో. నేను నిన్ను 'ఏరా'అంటే ఏం చేస్తావు?"

పరిశుద్ధం చిరాగ్గా అటూ ఇటూ చూసాడు. అన్నాడు, "మీరు ఇంక ఫైటింగ్‌లోకి దిగారన్నమాట!... ఆస్తులు హరించుకుపోతాయి, తెల్సా?"

"అంతకుముందు, మీ అహంకారం కరిగిపోతుంది తెల్సా!"

కోపంతో పరిశుద్ధం కళ్లు సర్రున ఎర్రబడ్డాయి.

"ఏంటండీ, మొన్నట్నించీ చూస్తున్నాను, అహంకారం మీదా, నాదా! నా డ్యూటీలో కల్పించుకొనే, అహంకారం మీది! మీకూ నాకూ అసలు ఏం సంబంధం ఉంది?"

"అహంకారం మీది! ... దేవుడి ముఖ మంటపంలోకి బూట్లు వేసుకొని రావటమేమిటి! మూల విరాట్టు పీఠంకన్నా ఎత్తు పీఠంమీద కూర్చోవటమేమిటి! మీరు తాగి పారేసిన టీ కప్పులు ఆ తులసి వనంలోకి విసిరెయ్యటమేమిటి! అసలు మీ వంటిమీద పంచె, మీ మొహాన బొట్టూ లేకపోవటమేమిటి!... ఈ అపచారాలన్నీ చేస్తూ అది చాలక దేవుడి గోపురం మీద కూడా మీ దౌష్ట్యం ఏమిటి!... ఇది కాదా పరాకాష్ఠకొచ్చిన మీ అహంకారం!"

పరిశుద్ధం కోపంతో ఊగిపోయాడు. పెదిమలు వణికాయి. అసహనంగా కుర్చీలో అటూ ఇటూ కదిలాడు. అన్నాడు: "దేవుడు, దేవుడు, దేవుడు!... ఎవడయ్యా దేవుడు? ఎక్కడయ్యా?... ఆ రాతిలోనా!... ఎక్కడో స్వర్గంలో ఉండే దేవుణ్ణి తీసుకొచ్చి ఈ రాయిలో ఉన్నాడనడం అబ్సల్యూట్లీ ఫూలిష్‌నెస్!... అదిగో గోపురం మీద కూడా విగ్రహాలున్నాయి. అవ్వి తలలు విరిగి కింద పడ్డాయి. వాటిల్లో దేవుడు. ఏదీ, బయటికి రాడే!... అట్టర్ నాన్సెన్స్!"

విష్ణుచక్రం శాంతంగా ఒక నవ్వునవ్వాడు, అన్నాడు, "ఇప్పుడు పరిశుద్ధంగారి అసలు రంగు బయటపడింది! సరే, వినండి... ఈ దేవాలయం కట్టించినవాళ్లు దేవుడు ఈ మూల విరాట్టులో మాత్రమే ఉన్నాడనే అభిప్రాయంతో కట్టించలేదు... హిందూ ధర్మంలో దేవుడు స్వర్గంలో మాత్రమే లేడు. విశ్వంలో అంతటా ఉన్నాడు. ఈ గోపురంలో, ఈ మొక్కల్లో, ఆ పిట్టల్లో, మీలో, నాలో... అంతటా ఉన్నాడు. ఏ రూపంలో ఉన్నాడని మీరనుకున్నా ఆమోదమే. కానీ ఒక ఉమ్మడి రూపం ఉంటే దానికోసం ప్రజలకూ ఒక ఉమ్మడి బాధ్యత ఏర్పడి, వాళ్లు ఉమ్మడితనంతో జీవిస్తారు. కనీసం ఇక్కడైనా కలుస్తారు. కనుక ఆ ఉమ్మడి రూపమైన మూల విరాట్టును ఏర్పాటుచేసారు. ఆ మూల విరాట్టుకోసం మిగతా వ్యవస్థ అంతా ఏర్పాటయ్యింది."

"నాకు ఈ రూపం నచ్చదండీ? అప్పుడూ ఈ రాయినే దేవుడూ దేవుడు కూర్చోవలసిందేనా?"

"నచ్చకపోయినా పర్వాలేదు. కానీ, దాన్ని కొలిచే మిగతా ప్రజల్ని గౌరవించండి... దేవుడు, వెయ్యి తలలూ వెయ్యి కాళ్లు ఉన్నవాడట. అంటే, ఇప్పుడు నేను చెప్పినట్లు సృష్టి అంతా ఆయన రూపమే."

పరిశుద్ధంలో కోపం కొంచెం తగ్గింది అన్నాడు, "అది కాదండీ, ఒక గజదొంగ వచ్చి, "నాలుగు కేసులు దొరకాలి దేవుడా"అని ఈ రాతికి మొక్కుకుంటాడు. దొరుకుతాయా?"

విష్ణుచక్రం నవ్వాడు. అన్నాడు "ఆహాఁ... దొరికే అవకాశం ఉంది. ఆ దొంగతనానికి తగిన పాప ఫలమూ వాడికి తప్పదు! అయితే, హిందూ ధర్మంలో పైకిపోయినకొద్దీ దేవుడు, పాపమూ, పుణ్యమూ వగైరాలు లేనే లేవు, తెల్సా! మన డ్యూటీయే దేవుడు? లోకానికి మంచి కోరి డ్యూటీ చేస్తే మంచిగా దేవుణ్ణి కొలిచినట్టు! చెడు కోరి చేస్తే చెడుగా దేవుణ్ణి కొలిచినట్టు! అసలు, 'నేనే దేవుణ్ణి' అనుకొని డ్యూటీ చేస్తే ఎట్లాంటి దుర్మార్గుడయినా సన్మార్గుడయి తీరతాడు. దేవుడున్నాడో లేడో- ఆ గోలెందుకింక!"

> "అహంకారం మీది! ... దేవుడి ముఖ మంటపంలోకి బూట్లు వేసుకొని రావటమేమిటి! మూల విరాట్టు పీఠంకన్నా ఎత్తు పీఠంమీద కూర్చోవటమేమిటి! మీరు తాగి పారేసిన టీ కప్పులు ఆ తులసి వనంలోకి విసిరెయ్యటమేమిటి! అసలు మీ వంటిమీద పంచె, మీ మొహాన బొట్టూ లేకపోవటమేమిటి!...



"అయితే, ఇప్పుడు నేను చేసింది నా డ్యూటీయే. నేను ఉత్తముణ్ణే! ఈ కోర్టుకేసెందుకొచ్చింది?"

"మీ ఆత్మసాక్షిగా చెప్పండి, మీ మనస్సులో డ్యూటీ వరకే ఉంచా, అంతకుమించి ప్రజలకు వ్యతిరేకంగా ఈ గోపురాన్ని కూల్చేయాలని ఉందా?"

"... ... ఈ కేసు నేనే గెలుస్తాను."

"చూద్దాం. ఈ లోపల మీరు చేసిన ప్రజావ్యతిరేకపు పనికి, అంటే దైవాపచారానికి ఫలితం మీరు అనుభవించకుండా ఉంటే గదా!" - ఇట్లా అంటూ విష్ణుచక్రం లేచి, తన ఇంటికి నడిచాడు.

★ ★ ★

గోపురం మీద పని ఆగిపోయింది.

వారం తిరిగేసరికి పురావస్తుశాఖ కమీషనర్ వచ్చి, "అసలు నువ్వు శిల్పాలను ఎందుకు ముట్టుకున్నావు"అని పరిశుద్ధాన్ని ముక్క చివాట్లు పెట్టాడు. వెళ్లిపోయాడు.

ఒక అకాల వర్షం కురిసింది. పరిశుద్ధానికి లేకలేక కలిగిన ఒకే ఒక సంతానం- పన్నెండేళ్ల కొడుకు - ఆ రోజు గోపురం దగ్గరకొచ్చి అటూ ఇటూ తిరుగుతున్నాడు. పైన సగం కత్తిరించబడి ఉన్న శిల్పం తాలూకు తల, వాన నీటి బరువుచేత తోయబడి కింద పడింది. ఆ కుర్రాడి తల మీద పడింది. తల పగిలింది. మర్నాడు ఆ కుర్రాడు మరణించాడు.

పరిశుద్ధాన్ని దేవాదాయశాఖ, పురావస్తుశాఖ సలహా మీద, సస్పెండ్ చేసింది.

అవినీతి నిరోధకశాఖ జనం వచ్చి, పరిశుద్ధం దోచుకున్నదీ, దాచుకున్నదీ- అంతా తోడుకుని తీసికెళ్లిపోయారు. పైగా కేసులు!

ఇట్లా కోర్టులో కేసు తేలే లోపలే పరిశుద్ధం తీవ్ర దుఃఖానికి గురయ్యాడు!

★ ★ ★

అరకులోయలో ఒక ఉదారుడు అనాథ విద్యాలయం పెట్టాడు. తాత్కాలికంగా ప్రిన్సిపాల్ కావాలన్నాడు. విష్ణుచక్రం వెళ్లి ఆ డ్యూటీలో చేరాడు. ఆ సాయంత్రం విష్ణుచక్రం, వసతి గృహం వైపు పరిశీలనకు వెళ్లగా, అక్కడ ఆ వసతి గృహం వార్డెన్‌గా ఉన్న పరిశుద్ధం ఎదురుపడ్డాడు!

పరిశుద్ధం అవాక్కయ్యాడు. తలొంచుకున్నాడు.

విష్ణుచక్రం అతని భుజంమీద చెయ్యేసి అన్నాడు, "అదృష్టవంతులు మీరు. దేవుడు మీకు అనేక విధాలుగా వెంటనే కనిపించాడు. కొంతమందికైతే అనేక జన్మల్లో అల్లా కనిపిస్తూనే ఉంటూ ఉంటాడు! పాపం!

గద్గద స్వరంతో పరిశుద్ధం అన్నాడు, "ఈ దేవుణ్ణి భరించలేను... ఉపాయం చెప్పండి."

విష్ణుచక్రం అన్నాడు, "అట్లా అయితే ఈ పిల్లల్లో ఉన్న దేవుడికి మీలో ఉన్న దేవుడు సేవ చేస్తున్నట్లుగా భావించి మీరు సేవ చెయ్యండి. మరింక మీకు దేవుడు ఇట్లా కనిపించడు!"

★

# వీర సైనికుల మ్యూజియం

ప్రపంచంలోని వివిధ దేశాల్లో తమ దేశంకోసం అనేక విధాలుగా తమ సేవలు అందించి, ఎందరో మాతృభూమి రుణం తీర్చుకొన్నారు. స్వాతంత్ర్య సమరాల్లో పాల్గొని, ఎన్నెన్నో సాంఘిక సేవలుచేసి, వారు తమ దేశ ప్రజలను ఆదుకొన్నారు. ఆ సేవలను అన్నిటినీ మించిన ఓ మహత్తరమైన సేవ ఒకటుంది. అదే- తమ దేశాన్ని కాపాడుకొనడంకోసం, వివిధ దేశాలతో ఏర్పడిన యుద్ధాలలో పాల్గొని వీర మరణం చెందడం.

ఆ వీర జవాన్ల సేవ చిరస్మరణీయం. అసలైన త్యాగధనులు వారే. ఆ సైనికుల, సైనికాధికారుల గౌరవార్థం, దేశంకోసం ప్రాణాలర్పించిన ఆ వీరుల స్మృత్యర్థం- ఆస్ట్రేలియాలో ఓ మ్యూజియం నెలకొల్పబడింది. దాని పేరు 'వార్ మ్యూజియం'. ఆస్ట్రేలియాలో జరిగిన అనేక యుద్ధాలలో 1 లక్షకు పైగా సైనికులు మృతి చెందారు. అచ్చట రూపుదాల్చిన మ్యూజియంలో యుద్ధచరిత్ర- వివిధ గ్రంథాలలో పొందుపరచబడింది.

యుద్ధాలను చిత్రిస్తూ, ప్రముఖ చిత్రకారులు చిత్రించిన వర్ణ చిత్రాలు, శిల్పులు రూపొందించిన సుందరమైన శిల్పాలు, ఆ సంగ్రామాలలో వినియోగించిన ఆయుధాలు పొందుపరచబడ్డాయి. ఛార్లెస్ బీన్ అనే కరస్పాండెంట్ మదిలో మెదిలిన ఊహకు రూపకల్పన ఆ మ్యూజియం. ఛార్లెస్ ఆస్ట్రేలియా ప్రభుత్వపు విలేకరి. ఆస్ట్రేలియా ఇంపీరియల్ సైన్యం- ఫ్రాన్స్, బెల్జియంలలో జరిపిన యుద్ధాలను ఛార్లెస్ స్వయంగా చూశాడు. గాయపడిన సైనికులను పరామర్శించాడు. వైద్య సేవలు అందించాడు. ఆ సంగ్రామాలలో జరిగిన అనేకానేక సంఘటనలను తన డైరీలో పొందుపరిచాడు. యుద్ధాలలో లక్ష మంది సైనికులు మరణించడం చూసి ఛార్లెస్ చలించిపోయాడు. వారి సేవలు చరిత్రలో చిరస్థాయిగా నిలిచి ఉండడం కోసం ఈ తరం వారికి, రానున్న తరాల వారికి- ఆ సైనికుల ధైర్య సాహసాలు, అందించిన సేవలు తెలియచెయ్యడంకోసం ఓ మ్యూజియం నెలకొల్పాలని అతను భావించాడు. 1918వ సంవత్సరంలో ప్రభుత్వాన్ని ఛార్లెస్ మ్యూజియం నిర్మాణానికి ఒప్పించాడు. ఆ వార్ మ్యూజియంలో 'రోల్ ఆఫ్ ఆనర్', 'పూల్ ఆఫ్ రిఫ్లెక్షన్', 'ఎటర్నల్ ఫ్లేమ్', 'హాల్ ఆఫ్ మెమరీ', ఓ అజ్ఞాత సైనికుని సమాధి ఏర్పాటుచెయ్యబడ్డాయి. అక్కడ ఓ రీసెర్చి సెంటర్ కూడా ఉన్నది. ఒక హాల్లో ఆడియో కూడా ఉంచారు. అందులో కనిపించే యుద్ధ దృశ్యాలు ప్రేక్షకులకు గగుర్పాటు కలిగిస్తాయి.

-కెవిఎస్